సాక్షి జయశంకర్ భూపాలపల్లి

బుధవారం | 1 | జనవరి | 2025



అట్టహాసంగా అథ్లెటిక్స్ క్రీడోత్సవాలు

హనుమకొండలోని జేఎన్ఎస్‌లో సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. - 8లో



కంకరతేలి.. గుంతలుగా ఏర్పడి..

మల్హర్ మండలంలోని పెద్దతూండ్ల ఎస్సీకాలనీ సీసీ రోడ్లన్నీ దెబ్బతిన్నాయి. అడుకో గుంత, గజానికో గొయ్యిలా రోడ్ల పరిస్థితి మారింది. - 9లో

వాతావరణం


గరిష్ఠం/కనిష్ఠం $29.1^{0}/15.2^{0}$


జిల్లాలో ఉదయం పొగమంచు కురుస్తుంది. మధ్యాహ్నం ఎండ ఎక్కువగా ఉంటుంది. రాత్రి చలి తీవ్రత పెరిగే అవకాశం ఉంది.

ఉద్యోగమే మొదటి ప్రాధాన్యం

నయా సాల్ నయా సోచ్..

- ఈ ఏడాది కొలువు సాధిస్తామంటున్న యువత
- మంచి కోసమే సోషల్ మీడియా వినియోగం
- గతం కంటే మద్యపానం తగ్గిస్తాం
- 'సాక్షి' సర్వేలో పలువురి వెల్లడి








కొత్త సంవత్సరంలో కొత్తగా ఉండాలని కాంక్షించడమే కాదు.. గట్టి నిర్ణయం తీసుకుంటామని యువత చెబుతుంది. నయా సాల్ నయా సోచ్ అంటూ తమ అభిప్రాయాన్ని పంచుకుంటున్నారు. పాత అలవాట్లకు కొంత స్వస్తి చెప్పడమే కాకుండా ఆరోగ్యం పెంచుకోవడం, ఉద్యోగమే లక్ష్యంగా ముందుకు సాగుతామని చెబుతున్నారు. 2024 సంవత్సరం ముగిసి 2025 ఏడాదిలోకి అడుగుపెట్టాం. ఈ నేపథ్యంలో గత ఏడాదిలో మంచిచెడులు, నేర్చుకున్న పాఠాలు, కొత్త సంవత్సరంలో నిర్దేశించుకోవాల్సిన లక్ష్యాలపై 'సాక్షి' బృందం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 500 మందిని సర్వే చేసింది. వీరిలో చదువు ముగిసిన వారు ఎక్కువ మంది ఈ ఏడాది ఉద్యోగ సాధనే మా టార్గెట్ అంటూ చెప్పుకొచ్చారు. మద్యపాన విషయంలో పూర్తిగా మానేస్తామనే వారికంటే గతం కంటే తగ్గిస్తామని ఎక్కువ మంది తెలిపారు. - సాక్షి బృందం


ఉద్యోగం సాధించడమే లక్ష్యం..



కొత్త సంవత్సరంలో డిగ్రీ పూర్తి చేసిన అనంతరం ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం. ఇందుకు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగేందుకు నిర్ణయం తీసుకుంటా. సోషల్ మీడియాను ఫాలో అయ్యే సమయాన్ని తగ్గించి ఉద్యోగాన్ని సాధించేందుకు ఉపయోగపడే మెటీరియల్స్‌ను చదువుకుంటా.

- సిలువేరు క్రాంతిరణదేవ్, డిగ్రీ విద్యార్థి





న్యూస్‌రీల్

ఉద్యోగ విరమణ తప్పనిసరి

ఎస్పీ కిరణ్ ఖరే



భూపాలపల్లి: ప్రభుత్వ ఉద్యోగులకు ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, శేష జీవితాన్ని ప్రశాంతంగా గడపాలని ఎస్పీ కిరణ్‌ఖరే అన్నారు. ఉద్యోగ విరమణ పొందిన ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ యాటకాల సుధాకర్‌ను మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ సన్మానించారు. 41 ఏళ్ల పాటు పోలీస్ శాఖలో పనిచేసి సేవలు అందించడం అభినందనీయమన్నారు. పదవీ విరమణ అనంతరం ఏదైనా సమస్య ఉంటే నేరుగా తనకు తెలియజేయాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ అసిస్టెంట్ ఎస్పీ వేముల శ్రీనివాస్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ నగేష్ పాల్గొన్నారు.

జిల్లా పోలీసులకు పోలీసు సేవా పతకాలు

భూపాలపల్లి: జిల్లాకు చెందిన ఇద్దరు పోలీసులు పోలీసు సేవా పతకానికి ఎంపికయ్యారు. విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందిని వివిధ పతకాలకు ఎంపిక చేస్తూ మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి రవిగుప్తా జీఓ విడుదల చేశారు. ఇందులో జిల్లాకు చెందిన సీహెచ్ సుధీర్, ఏఎస్సై, భూపాలపల్లి, ఎస్‌కే మహబూబ్, ఏఆర్ హెడ్ కానిస్టేబుల్‌ను భూపాలపల్లి పోలీసు సేవా పతకాలకు ఎంపిక చేశారు.

భర్త వేధింపులు తాళలేక ఆత్మహత్య

భూపాలపల్లి రూరల్: భర్త వేధింపులు తాళలేక వివాహిత పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన భూపాలపల్లి మండలం రాంపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. భూపాలపల్లి సీఐ నరేష్ కథనం ప్రకారం.. భర్త మహేందర్ పెట్టే వేధింపులు తాళలేక రాంపూర్ గ్రామానికి చెందిన పాపినేని శ్రీవాణి (20) డిసెంబర్ 28న పురుగుల మందుతాగింది. దీంతో కుటుంబసభ్యులు, బంధువులు చికిత్స నిమిత్తం వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందింది. మృతురాలి తండ్రి ఫిర్యాదుమేరకు మహేందర్‌పై కేసు నమోదు చేసినట్లు సీఐ నరేష్ తెలిపారు.

అధిక ధరలకు ఎరువులు అమ్మితే చర్యలు



చిట్యాల: మండలంలోని ఫర్టిలైజర్–పెస్టిసైడ్ షాపులలో రైతులకు అధిక ధరలకు ఎరువులు, పురుగు మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని భూపాలపల్లి డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు ఎన్.రమేష్ హెచ్చరించారు. ఈ సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీలో భాగంగా స్టాక్ రిజిస్టర్స్, బిల్ బుక్స్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డీలర్లు, షాపు యాజమానులు ఎవరైనా పురుగు మందులను ఎక్కువ ధరలకు అమ్మితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలని తెలిపారు. డీలర్లు అవకతవకలకు పాల్పడితే లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరించారు. ఈ తనిఖీలో మండల వ్యవసాయ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, ఏఈఓలు ఉన్నారు.



'కొత్త' కలలు కందామా..కల అంటే నిద్రలో వచ్చేది కాదు. నిద్రపోనివ్వకుండా చేసేది. కలలు కనండి. వాటిని సాకారం చేసుకోండి.


- మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం

కుంచిత భావన మనసుకే కానీ.. ఊహకు కాదు.. కాస్త పెద్ద కలలు కందాం. 'నేస్తమా.. బిగ్ డ్రీమ్'..

- ప్రముఖ రచయిత జిడ్డు కృష్ణమూర్తి

అందరి జీవితంలోనూ న్యూ ఇయర్ వస్తుంది. కొందరేమో కొత్త అలవాట్లతో ముందుకెళ్తారు. మరికొందరేమో రొటీన్ జీవితానికే అలవాటు పడతారు. కొత్త కలలు మిమ్మల్ని విజయానికి దగ్గర చేస్తాయి. మీకు సరికొత్త ఉత్సాహాన్నిస్తాయి. మీ అలవాట్లలో స్వల్ప మార్పులు మిమ్మల్ని అందరిలో ప్రత్యేకంగా నిలబెడతాయి. 2025 లో ఈ 5 సూత్రాలు పాటిస్తే ఉన్నత శిఖరాలకు చేరొచ్చని మానసిక వికాస నిపుణులు అంటున్నారు.

- సాక్షి ప్రతినిధి, వరంగల్/ హన్మకొండ కల్చరల్



'కొత్త' కలలు.. సరికొత్త అడుగులు

నూతన సంవత్సరం.. ఆనంద జీవితం

- విజయానికి పంచ సూత్రాలు
- ఉద్యోగం, ఉపాధితో మెరుగైన జీవనం
- ముందస్తు అప్రమత్తతతో సైబర్ మోసాలకు దూరం
- పాత జ్ఞాపకాలను మరిచి కొత్త ఆశయాలతో ముందుకు..

బైబై 2024- వెల్‌కమ్ 2025

కొత్త కలలు కందాం. సరికొత్తగా అడుగులు వేద్దాం. ఇన్నాళ్లు ఒక లెక్క. ఇకపై ఒక లెక్క. నువ్వేంటో నిరూపించుకునే రోజొకటి రానే వచ్చింది. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ.. అందరికీ విష్ చేయడం కాదు. నీ జీవితంలో ఎంత హ్యాపీ నెస్ ఉందో ఆత్మపరిశీలన చేసుకో. జీవితంలో ఆనందం నిండాలంటే.. నీ విలువ పెంచుకోవాలి. అందుకే 'లెర్నింగ్ ఈజ్ ఎర్నింగ్' అన్నారు. ఎంత నేర్చుకుంటే అంత సంపాదిస్తావ్. కొత్త అలవాట్లు నిన్ను సరికొత్తగా చూపిస్తాయ్.

ఆరోగ్యమే ఆనంద యోగం..



మిమ్మల్ని నడిపే సిస్టం ఒకటి మీలోనే ఉంటుంది. అదే ఆరోగ్యం. రోజులో కొంత సమయాన్ని దాని కోసం కేటాయిస్తే.. రోజంతా మీరేపని చేసినా రెట్టింపు ఫలితం వస్తుంది. ఉదయాన్నే వాకింగ్ లేదా రన్నింగ్‌కు వెళ్లారనుకోండి.. రోజంతా తేలికగా అనిపిస్తుంది. రోజులో కనీసం పావుగంట మీకిష్టమైన మ్యూజిక్ వినడం, మెడిటేషన్, యోగా వంటివి సాధన చేస్తే రోజంతా హాయిగా గడుస్తుంది. ఏపని మీదైనా శ్రద్ధ పెట్టగలుగుతారు. 'రోజూ అరగంట సేపు ఆరోగ్యం కోసం కేటాయిస్తే జీవితంలో డాక్టర్ వద్దకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు' అని ఇటీవల అమెరికాలోని ఓ యూనివర్సిటీ నిర్వహించిన సర్వేలో వెల్లడించారు.

ఉద్యోగమే ఉన్నతికి మార్గం



పొరుగు దేశాల్లో బాల్యదశ నుంచే పార్ట్ టైం జాబ్‌లు చేస్తారు. తల్లిదండ్రుల మీద ఆధారపడకుండా తమ కాళ్ల మీద తాము నిలబడాలని.. చిన్నా చితకా పనులు చేసి సంపాదిస్తారు. ప్రపంచ కుబేరుడు వారెన్ బఫెట్ కూడా చిన్నతనంలో ఇళ్లు.. ఇళ్లు తిరిగి చూయింగ్ గమ్స్, కొకాకోలా అమ్మేవాడు. ఇలా.. కోట్లు కూడబెట్టిన వాళ్లైనా.. జీవితంలో స్థిర పడ్డ వారైనా చిన్నతనం నుంచే పని చేయడం ప్రారంభించారు. డిగ్రీలు, పీజీలు చేసి సరైన ఉద్యోగం లేక ఎంతో మంది ఖాళీగా ఉంటున్నారు. ఉద్యోగమంటే బానిసత్వం కాదు. ఉన్నతికి మార్గం. చిన్నదో పెద్దదో దొరికితే ఉద్యోగం లేదంటే వ్యాపారం.. ఏదో ఒక పనిచేస్తే పేదరికాన్ని పారదోలవచ్చు.

పర్యావరణమే మనుగడకు మూలం



'పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత' అక్కడక్కడా ఈ నినాదం చూస్తూ ఉంటాం. మీరో మొక్క నాటకపోయినా పర్లేదు. 'పర్యావరణాన్ని కాపాడండి' అంటూ ప్రచారం చేయకపోయినా పర్లేదు. మరింత కలుషితం చేయకుండా ఉంటే చాలు. సిగరేట్లు తాగడం, ప్లాస్టిక్ బాటిళ్లను వినియోగించి పడేయడం. విచ్చలవిడిగా పాలిథిన్ వినియోగించడం. ఇలాంటివి చేయకుండా ఉంటే పర్యావరణానికి మేలు చేసినవారే.

అతినే ప్రమాదానికి కారణం



కరోనా సమయంలో కేవలం యూట్యూబ్‌లో వీడియోలు చూసి, ఆన్‌లైన్‌లో క్లాస్‌లు విని ఐఏఎస్‌లు, ఐపీఎస్‌లు అయిన వారు ఉన్నారు. రీల్స్ స్క్రోల్ చేస్తూ సమయాన్ని హరించిన వారూ ఉన్నారు. విజేతలకు, పరాజితులకు ఎవరికైనా సోషల్ మీడియా ఒకటే. ఎవరు ఎలా వాడుకుంటే అలా ఉపయోగపడుతుంది. అరచేతిలో ఇమిడే పరిజ్ఞానాన్ని మీఉన్నతికి ఉపయోగిస్తే ఉన్నతులుగా తయారవుతారు.

దురాశే దుఃఖానికి తీరం



గ్రేటర్ వరంగల్ నగరంలో సైబర్ వలలో చిక్కిన వారిలో దాదాపు 90 శాతం మంది యువకులే. వారి అత్యాశను క్యాష్ చేసుకుంటున్నారు సైబర్ నేరగాళ్లు. స్టాక్ మార్కెట్ అని ఒకరు. రూపాయి పెడితే పది రూపాయలొస్తుందని మరొకరు. తెలియని లింకులు నొక్కి ఇంకొకరు ఇలా నిత్యం నష్టపోతూనే ఉన్నారు. టెక్నాలజీ వాడకంతో పాటు అందులో వస్తున్న విపరీతమైన పోకడలను సైతం యువత ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. మోసపోకుండా జాగ్రత్త పడాలి.

మైక్రో ఫైనాన్స్ వేధింపులకు కుటుంబం బలి

- గత నెల 6న భార్య ఆత్మహత్యాయత్నం.. చికిత్స పొందుతూ మంగళవారం మృతి
- 20న ఉరేసుకుని భర్త బలవన్మరణం



దేవేందర్ (ఫైల్)



చందన (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: మైక్రో ఫైనాన్స్ వేధింపులకు ఓ కుటుంబం బలైంది. ఈ ఘటన భూపాలపల్లి మండలం కమలాపూర్ గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బానోత్ దేవేందర్(37), చందన(32) భార్యాభర్తలు. జిల్లా కేంద్రంలోని టాటా, ఐఐఎఫ్ఎల్, బంధన్ బ్యాంక్, పినకేర్ మైక్రో ఫైనాన్స్ సంస్థల్లో రూ.3లక్షల వరకు గతంలో రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణం వారం వారం చెల్లించాల్సి ఉంటుంది. కొద్ది రోజులుగా తీసుకున్న అప్పును తిరిగి చెల్లించకపోవడంతో ఫైనాన్స్ సంస్థల సిబ్బంది, తోటి సభ్యులు రోజూ ఇంటికి వచ్చి గొడవకు దిగారు. దీంతో మనస్తాపం చెందిన చందన డిసెంబర్ 6న పురుగుల మందు తాగింది. వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం చనిపోయింది. చందన ఆత్మహత్యాయత్నానికి పాల్పడి చావుబతుకుల మధ్య ఉండగా డిసెంబర్ 20న భర్త దేవేందర్ తన ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతులకు ఇద్దరు కుమారులు ఉండగా వారి మరణంలో అనాథలుగా మారారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

'బిల్ట్' నుంచి దట్టమైన పొగ



మంగపేట: మండల పరిధిలోని కమలాపురంలో కూల్చివేసిన బిల్ట్ ఫ్యాక్టరీ ప్రాంతం నుంచి మంగళవారం మధ్యాహ్నం 3గంటల ప్రాంతం నుంచి దట్టమైన పొగ ఎగిసిపడింది. మూతపడిన కర్మాగారాన్ని పూర్తిస్థాయి తొలగింపు పనులు కొన్ని నెలలుగా చేస్తున్న విషయం తెలిసిందే. కొద్ది రోజుల క్రితం వరకు ఫ్యాక్టరీలోని భవనాలు, వాటి బేస్‌మెంట్‌ను బాంబులు అమర్చి పేల్చివేస్తుండటంతో స్థానికులు ఉలిక్కిపడుతున్నారు. ఇదిలా ఉండగా గతంలో ఫ్యాక్టరీలోని కలప స్టాక్ యార్డుకు నిప్పంటుకున్న సందర్భంలో వచ్చిన పొగకంటే ఎక్కువగా పొగ బయటకు వచ్చి 12కిలో మీటర్ల మేర గ్రామాన్ని కమ్మేయడంతో ఏమి జరిగిందో తెలియక ప్రజలు ఆందోళనకు గురయ్యారు. ఫ్యాక్టరీలోకి బయటి వ్యక్తులు ఎవరూ లోనికి రాకుండా చూసేందుకు కాంట్రాక్టర్ ప్రత్యేకంగా సిబ్బందిని నియమించాడు. దీంతో ఎలాంటి సమాచారం బయటకు రాకపోవడంతో మండల ప్రజలు ఆయోమయానికి గురయ్యారు. రాత్రి వరకు ఫ్యాక్టరీలోని(ఎఫ్ఆర్‌పీ) పైపులు, సిల్ట్ పైపులకు చుట్టూ ఉన్న ప్లాస్టిక్‌ను తొలిగించేందుకు కాల్చి వేస్తున్నారనే సమాచారం బయటకు రావడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

హ్యాపీ న్యూ ఇయర్



పట్టణంలో కేక్ కట్ చేస్తున్న మహిళలు



సంబరాలు చేసుకుంటున్న చిన్నారులు, మహిళలు

- అర్ధరాత్రి అట్టహాసంగా సంబరాలు
- కేకుల కటింగ్, స్వీట్ల పంపిణీ

భూపాలపల్లి అర్బన్: కొత్త సంవత్సరానికి ప్రజలు కోటి ఆశలతో స్వాగతం పలికారు. సరిగ్గా రాత్రి 12గంటలకు 2024 సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ నూతన సంవత్సరాన్ని సాదరంగా ఆహ్వానించారు. 2025 సంవత్సరంలో అన్నీ శుభాలే కలగాలని, అందరూ సుఖంగా ఉండాలని ఆకాంక్షిస్తూ సెల్‌ఫోన్ వాట్సప్ సందేశాలు వెల్లువెత్తాయి. హ్యాపీ న్యూ ఇయర్ అంటూ అందరూ ఆనందోత్సాహాలతో కేరింతలు కొట్టారు. కేకులు కట్ చేశారు. స్వీట్లు పంచుకున్నారు. పరస్పరం ఆలింగనం చేసుకున్నారు. సంతోషంతో నృత్యాలు చేశారు. కొత్త సంవత్సరాన్ని స్వాగతిస్తూ పాటలు పాడారు.

పోలీసులకు సవాల్‌గా..

కొత్త సంవత్సర వేడుకలలో అవాంఛనీయ ఘటనలు, రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు ఎస్పీ కిరణ్‌ఖరే ఆదేశాల మేరకు పోలీసులు జాగ్రత్త పడ్డారు. సాయంత్రం నాలుగు గంటల నుంచే కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాకేంద్రంలో అల్లరు, గొడవలు తలెత్తకుండా ఉండేందుకు పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. సీఐ నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో ఎస్సైలు సుధాకర్, రమేష్, శ్రీలత డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించారు. రాత్రి వేళ వాహనాల స్పీడ్‌ను నియంత్రించేందుకు అన్నిచోట్ల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. అంబేడ్కర్ సెంటర్, జయశంకర్ సెంటర్, గణేష్‌చౌక్, కాలనీల్లోని ప్రధాన కూడళ్ల వద్ద పోలీసు తనిఖీలు చేశారు. జిల్లాలో అడుగడుగునా డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేశారు.

ప్రధాన సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం
- కలెక్టర్ రాహుల్ శర్మ



భూపాలపల్లి: కొత్త సంవత్సరంలో జిల్లాలోని ప్రధాన సమస్యలపై దృష్టి సారిస్తామని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. వర్షాభావం, పేదరిక నిర్మూలన, రవాణా సౌకర్యాల అభివృద్ధి, తాగునీటి సమస్యల పరిష్కారం, విద్య, ఆరోగ్య రంగాలలో మెరుగుదల వంటి సమస్యలకు ప్రాధాన్యత ఇస్తామని చెప్పారు. 2025 సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా కొత్త ఏడాదిలో జిల్లాలో చేపట్టనున్న కార్యక్రమాలపై కలెక్టర్‌తో 'సాక్షి' ఇంటర్వ్యూ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను లబ్ధిదారులకు అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటా. ముఖ్యంగా పేదలకు మెరుగైన విద్య, వైద్యం అందించేందుకు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అన్ని రకాల సదుపాయాలు కల్పించడం, పదో తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ప్రతీ గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించడం, నిరుద్యోగ సమస్య పరిష్కారానికి స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు అధికంగా నిర్వహిస్తాం. జిల్లా ప్రజల అభివృద్ధే మా లక్ష్యం. 2025 సంవత్సరం అందరికీ శాంతి, సంతోషం, ఆరోగ్యం, అభివృద్ధి కలిగించాలని ఆకాంక్షిస్తున్నా. ప్రజల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అర్హులైన చిట్టచివరి కుటుంబం వరకు చేరేలా అన్ని శాఖల అధికారుల సమష్టి కృషితో ముందుకు వెళ్తాం. జిల్లా ప్రజలు, అధికారులు, అన్ని వర్గాల వారికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

భూనిర్వాసితులకు మెరుగైన పరిహారం

- ఆర్డీఓ మంగీలాల్



ఆర్డీఓ మంగీలాల్

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని పలు మండలాల మీదుగా వెళ్తున్న నాగాపూర్-విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి భూ నిర్వాసితులకు మెరుగైన పరిహారాన్ని చెల్లించినట్లు ఆర్డీఓ మంగీలాల్ తెలిపారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లోని 14 గ్రామాలకు చెందిన 445మంది రైతులకు చెందిన 375 ఎకరాల వ్యవసాయ భూమిని 35 కిలోమీటర్ల మేర భూసేకరణ చేసినట్లు చెప్పారు. ఇందుకుగాను రైతులకు ఎకరానికి ప్రభుత్వం రూ.3.50లక్షల నుంచి రూ.6.50లక్షల వరకు పరిహారం చెల్లించేందుకు అవార్డు జారీచేసినట్లు చెప్పారు. దీనిని వ్యతిరేకించిన రైతులు మెరుగైన పరిహారం చెల్లిస్తేనే భూములు ఇస్తామని డిమాండ్ చేసినట్లు తెలిపారు. దీంతో కలెక్టర్ రాహుల్‌శర్మ నిర్ణయాధికారంతో ఎకరానికి రూ.21లక్షల నుంచి రూ.28లక్షల వరకు పరిహారం చెల్లించేందుకు అనుమతి ఇచ్చినట్లు చెప్పారు. జాతీయ రహదారి శాఖ అధికారులు కూడా అమోదించి ఇందుకు కావాల్సిన బడ్జెట్‌ను పెంచగా 98మంది రైతులకు పెంచిన విధంగా పరిహారం బ్యాంకు ఖాతాల్లో జమచేసినట్లు తెలిపారు. మిగిలిన రైతులు కూడా ఆర్డీఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

ఇంటికి రూ.500

- ఇందిరమ్మ ఇళ్లకోసం టీఏ డబ్బులు వసూలు



ఎంపీడీఓకు ఫిర్యాదు అందిస్తున్న బాధితులు

కాటారం: మహాముత్తారం మండలంలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పేరిట ఓ అధికారి డబ్బులు వసూలుకు పాల్పడగా గ్రామస్తులు ఎంపీడీఓకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటకు వచ్చింది. మహాముత్తారం మండలం దొతుపల్లిలో ఉపాధిహామీ టెక్నికల్ అసిస్టెంట్ ప్రసాద్ ఇటీవల సర్వే నిర్వహించారు. ఇళ్లు మంజూరు కావాలంటే ఒక్కో లబ్ధిదారుడు రూ.500 ఇవ్వాలని డిమాండ్ చేసి సుమారు 10మంది వద్ద రూ.5వేల వరకు డబ్బులు తీసుకున్నాడు. అర్హులైన వారికి మాత్రమే ఇళ్లు మంజూరవుతాయని తెలుసుకున్న బాధితులు సదరు టీఏను డబ్బులు తిరిగి అడగగా స్పందించలేదు. దీంతో వారు మంగళవారం ఎంపీడీఓ శ్రీనివాస్‌రావుకు ఫిర్యాదుచేశారు. విచారణ జరిపి తమ డబ్బులు తమకు ఇప్పించాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో సమ్మక్క, రజిత, సునిత, రాజక్క, లక్ష్మి, రామక్క, రజిత, మల్లయ్య, మల్లక్క, పోశమ్మ ఉన్నారు. ఈ విషయమై ఎంపీడీఓ శ్రీనివాస్‌రావును సాక్షి వివరణ కోరగా టీఏ ప్రసాద్‌పై దొతుపల్లి గ్రామస్తులు ఫిర్యాదుచేశారన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి ఆదేశాల మేరకు విచారణ చేపట్టనున్నట్లు తెలిపారు.

















అట్టహాసంగా అథ్లెటిక్స్, రెజ్లింగ్ క్రీడోత్సవాలు

● ప్రారంభించిన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వరంగల్ స్పోర్ట్స్: హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సీఎం కప్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్, రెజ్లింగ్ పోటీలు మంగళవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ క్రీడోత్సవాలకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ముందు మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ మృతికి రెండు నిమిషాలు మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ క్రీడలకు హనుమకొండ కేంద్ర బిందువుగా నిలుస్తోందన్నారు. ప్రతిభ కనబరిచి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు తీసుకురావాలని క్రీడాకారులకు సూచించారు. హనుమకొండ డీవైఎస్‌ఓ గుగులోత్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ ఈ నెల 2వ తేదీ వరకు జరిగే పోటీలకు వివిధ జిల్లాల నుంచి 2 వేల మంది క్రీడాకారులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ ఎండి. అజీజ్‌ఖాన్, అథ్లెటిక్స్ సంఘం జిల్లా చైర్మన్ వరద రాజేశ్వర్‌రావు, రెజ్లింగ్ సంఘం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ కరీం, కోచ్‌లు నరేందర్, శ్రీమన్నారాయణ, కందికొండ రాజు, బొడ్డు విష్ణువర్ధన్, ఓనపాకల శంకర్, కూరపాటి రమేశ్, కె.ప్రశాంత్ పాల్గొన్నారు.


లాంగ్ జంప్ చేస్తున్న క్రీడాకారిణి

నేటినుంచి పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల వేళల్లో మార్పులు

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్ మీదుగా ప్రయాణించే పలు రైళ్ల వేళలను 2025 జనవరి 1వ తేదీ నుంచి మార్చి నడిపిస్తున్నట్లు కాజీపేట రైల్వే చీఫ్ బుకింగ్ సూపర్‌వైజర్ అధికారులు మంగళవారం రాత్రి తెలిపారు.

కాజీపేట మీదుగా వెళ్లే.. మారిన రైళ్ల వేళలు

హైదరాబాద్–గోరఖ్‌పూర్ (07075) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతి శుక్రవారం 23.23 గంటలకు వచ్చి 23.25 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–దర్భాంగా (17007) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, ఆదివారాల్లో 00.33 గంటలకు చేరుకుని 00.35 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–సిర్పూర్‌కాగజ్‌నగర్ (17011) కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.08 గంటలకు చేరుకుని 07.10 గంటలకు వెళ్తుంది. యశ్వంత్‌పూర్–జబల్‌పూర్ (12193) జబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం 05.48 గంటలకు చేరుకుని 05.50 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–నిజాముద్దీన్ (12437) ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధవారం 14.38 గంటలకు చేరుకుని 14.40 గంటలకు వెళ్తుంది. హైదరాబాద్–న్యూఢిల్లీ (12723) తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.58 గంటలకు చేరుకుని 08.00 గంటలకు వెళ్తుంది. తాంబరం–హైదరాబాద్ (12759) తాంబరం ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 04.33 గంటలకు చేరుకుని 04.35 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–రాయ్‌పూర్ (12771) రాయ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళ, గురు, శనివారాల్లో 00.33 గంటలకు చేరుకుని 00.35 గంటలకు వెళ్తుంది. నాగర్‌సోల్–నర్సాపూర్ (12788) నర్సాపూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, బుధ, గురు, శుక్ర, శనివారాల్లో 01.49 గంటలకు చేరుకుని 01.50 గంటలకు వెళ్తుంది. గోరఖ్‌పూర్–హైదరాబాద్ (07076) గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమవారం 13.15 గంటలకు చేరుకుని 13.17 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–గుంటూరు (17202) గోల్కొండ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 14.48 గంటలకు చేరుకుని 14.50 గంటలకు వెళ్తుంది. కాకినాడ–సాయినగర్ (17206) సాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, బుధ, శనివారాల్లో 12.58 గంటలకు చేరుకుని 13.00 గంటలకు వెళ్తుంది. మచిలీపట్నం–షిర్డీ సాయినగర్ (17208) సాయినగర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ మంగళవారం 12.58 గంటలకు చేరుకుని 13.00 గంటలకు వెళ్తుంది. సికింద్రాబాద్–భద్రాచలం రోడ్ (17659) కాకతీయ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 19.48 గంటలకు చేరుకుని 19.50 గంటలకు వెళ్తుంది. భద్రాచలం రోడ్–సికింద్రాబాద్ (17660) కాకతీయ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 07.43 గంటలకు చేరుకుని 07.45 గంటలకు వెళ్తుంది. లోకమాన్యతిలక్ టెర్మినల్–విశాఖపట్నం (18520) లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ రోజు 21.43 గంటలకు చేరుకుని 21.45 గంటలకు వెళ్తుంది. సంబల్‌పూర్–నాందేడ్ (20809) సంబల్‌పూర్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ సోమ, మంగళ, ఆదివారాల్లో 04.43 గంటలకు చేరుకుని 04.45 గంటలకు వెళ్తుంది. విశాఖపట్నం–నాందేడ్ (20811) నాందేడ్ ఎక్స్‌ప్రెస్ ప్రతీ బుధ, గురు, ఆదివారాల్లో 04.43 గంటలకు చేరుకుని 04.45 గంటలకు వెళ్తుంది. కాజీపేట–పూణె (22152) పూణె ఎక్స్‌ప్రెస్ ప్రతీ ఆదివారం కాజీపేట నుంచి 13.25 గంటలకు బయలుదేరి వెళ్తుంది.















చిన్నారిపై లైంగిక దాడి కేసులో..

నిందితుడికి 20 సంవత్సరాల జైలు

● తీర్పు వెలువరించిన జిల్లా కోర్టు జడ్జి అపర్ణాదేవి

వరంగల్ లీగల్ : మూడో తరగతి చదువుతున్న ఓ చిన్నారికి బిస్కెట్ ఇస్తానని చెప్పి ఇంట్లోకి పిలిచి లైంగిక దాడికి పాల్పడిన ఘటనలో నేరం రుజువుకావడంతో నేరస్తుడికి 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ వరంగల్ జిల్లా మొదటి అదనపు జిల్లా కోర్టు జడ్జి అపర్ణాదేవి మంగళవారం తీర్పు వెలువరించారు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం గూడూరుకు చెందిన దంపతులకు కూతురు (9 సంవత్సరాలు), కుమారుడు ఉన్నారు. బతుకుదెరువు నిమిత్తం పరకాల మండలం చౌటపర్తికి వెళ్లారు. పిల్లలను కమలాపూర్‌లోనే నానమ్మ, తాత వద్ద ఉంచి వెళ్లారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 08, 2018న నానమ్మ, తాత పని నిమిత్తం బయటకు వెళ్లారు. ఇంటికి తిరిగి రాగా మనవరాలు జ్వరంతో ఉండడంతో నానమ్మ మాత్రలు వేసింది. మరుసటి రోజు ఎంతకూ తగ్గకపోవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకొచ్చింది. అయినా తగ్గలేదు. ఈ క్రమంలో రెండు రోజుల క్రితం ఇంటి వద్ద ఆడుకుంటున్న సమయంలో ఎదురుగా అద్దెకు ఉంటున్న గూడూరు మండలం అక్కంపేటకు చెందిన దాసరి సంపత్ బిస్కెట్ ఇస్తానని తనను ఇంట్లోకి తీసుకెళ్లి శారీరకంగా ఇబ్బంది పెట్టాడని, అప్పటి నుంచి తనకు కాళ్లు బాగా లాగుతున్నాయని చిన్నారి తెలిపింది. దీంతో చిన్నారి నానమ్మ మరుసటి రోజు సెప్టెంబర్ 11న పోలీసులకు ఫిర్యాదు చేయగా పోక్సో కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువుకావడంతో నేరస్తుడు దాసరి సంపత్‌కు 20 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధిస్తూ జడ్జి అపర్ణాదేవి తీర్పు వెలువరించారు. బాధిత బాలికకు పరిహార చెల్లింపు పథకంలో భాగంగా రూ.2 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. కేసును ఏసీపీ కె.సత్యనారాయణ, సీఐ హరికృష్ణ పరిశోధించగా, లైజన్ ఆఫీసర్ కె.పరమేశ్వరి, భరోసా లీగల్ ఆఫీసర్ నీరజ పర్యవేక్షణలో కానిస్టేబుళ్లు హరీశ్, విక్రమ్ సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ప్రాసిక్యూషన్ పక్షాన పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజమల్లారెడ్డి కేసు వాదించారు.

దోపిడీ కేసులో నిందితుడికి ఏడేళ్ల జైలు

● తీర్పు వెలువరించిన సీనియర్ సివిల్ జడ్జి సురేశ్

మహబూబాబాద్ రూరల్ : కత్తితో ఓ మహిళ మెడ కోసి ఆమె బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లిన ఘటనలో నేరం రుజువుకావడంతో నేరుస్తుడికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ సీనియర్ సివిల్ జడ్జి సి.సురేశ్ మంగళవారం తీర్పు వెలువరించారు. కోర్టు డ్యూటీ అధికారి, హెడ్‌కానిస్టేబుల్ నెలకుర్తి అశోక్ రెడ్డి కథనం ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా కురవి మండలం భద్రు తండాకు చెందిన బాదావత్ చందన 2018 అక్టోబర్ 9న పత్తి చేనులో పని నిమిత్తం వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. అనంతరం ఇంటికి వస్తున్న సమయంలో నర్సింహులపేట మండలం పెద్దనాగారం శివారు అమీర్ తండాకు చెందిన బానోత్ సలీం వ్యవసాయ బావి వద్దకు వచ్చి చందన మెడ కోసి బంగారు ఆభరణాలు అపహరించుకెళ్లాడు. ఈ ఘటనలో చందన, తన భర్త రమేశ్ కురవి పీఎస్‌లో ఫిర్యాదు చేయగా అప్పటి ఎస్సై నాగభూషణం కేసు నమోదు చేశారు. అనంతరం మహబూబాబాద్ రూరల్ సీఐ జూపల్లి వెంకటరత్నం విచారణ జరిపి కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. ప్రాసిక్యూషన్ పక్షాన ఏపీపీలు సంతోషిణి, గణేశ్ ఆనంద్ కోర్టులో వాదనలు వినిపించగా మహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, కురవి ఎస్సై సతీశ్ ఆధ్వర్యంలో కోర్టు డ్యూటీ అధికారి అశోక్ రెడ్డి 13 మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. వాదనలు విన్న సీనియర్ సివిల్ జడ్జి సురేశ్.. నేరం రుజువుకావడంతో బానోత్ సలీంకు ఏడేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు.

అప్పుల బాధతో రైతు బలవన్మరణం

గూడూరు: అప్పుల బాధతో ఓ రైతు పంట పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మెట లోకయ్య గౌడ్ (48) గీత వృత్తితో పాటు తనకు ఉన్న రెండు ఎకరాల్లో వ్యవసాయం చేసుకుంటూ జీవనం గడుపుతున్నాడు. తనకు ఇద్దరు కూతుళ్లు ఉండగా.. రెండేళ్ల క్రితం పెద్ద కూతురు, ఏడాదిక్రితం చిన్న కూతురు పెళ్లిళ్లు చేశాడు. ఈక్రమంలో కొంత అప్పు చేశాడు. కొంతకాలంగా వ్యవసాయం గిట్టుబాటు కాకపోవడంతో కుటుంబ ఖర్చులు, అప్పుల బాధ ఎక్కువైంది. భార్య పిల్లలతో అప్పులు ఎలా తీర్చాలంటూ నెల రోజులుగా మతిస్థిమితం లేకుండా మాట్లాడుతున్నాడు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం పంట పొలం వద్దకు వెళ్లిన లోకయ్యగౌడ్ చెట్టుకు ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.


లోకయ్య మృతదేహం





